క్లుప్తంగా

'సదస్సు విజయవంతం చేయండి'

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలో ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే ఎడ్యుకేషన్ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూరు సంతోష్ అన్నారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో మాట్లాడారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సన్మానించడంతో పాటు ఉన్నత చదువులపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు మరప గంగారం, కోరేంగ సంబు, కనక ప్రభాకర్, కొడప లింగు, సోనేరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నార్నూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని నార్నూర్ సీఐ రహీం పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏకలవ్య కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్‌క్యాంప్ ప్రారంభించారు. సమ్మర్ క్యాంపు ద్వారా అన్ని రంగాలలో సరైన శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. యోగా, కరాటే, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్, పీఈటీతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టీబీ నివారణ ప్రతిఒక్కరి బాధ్యత

నేరడిగొండ: టీబీ నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో డీటీసీవో డాక్టర్ సుమలత, ఎస్‌టీఎస్‌లు దేవిదాస్, సుధ, హెచ్‌ఈవో పవార్ రవీందర్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీబీ నివారణ అవగాహన పోస్టర్ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. హైరిస్క్ ఉన్న వారందరికీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

సైన్స్ డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్‌లైన్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల కావడంతో విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మే 3 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. 3 దశల్లో ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఏవైన ఇబ్బందులు ఉంటే 7702157284, 9703533626 సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

తాంసి: విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఈదుల్లా సావర్గాం గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు ప్రభాకర్ మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి సోమవారం కార్మికుల నుంచి సేకరించిన రూ.12 వేల నగదును సీఐటీయూ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని కార్మికుడి ఇంటికి వెళ్లి సీఐటీయూ నాయకులు నగదు అందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతి చెందిన దళిత కార్మికుడిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన, అశోక్, గంగన్న, సోనేరావు, వెంకట్రావు, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

తాంసి: అర్హులైన దివ్యాంగులు, దళితులకు సైతం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్వర్, పోచ్చారెడ్డి, నర్సారెడ్డి, విలాస్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

లింగాష్టక పారాయణం

బోథ్: సొనాల గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న సామూహిక పారాయణ పదో వారానికి చేరుకుంది. ఉదయం 7.30లకు సామూహిక లింగాష్టక పారాయణం ప్రారంభించారు. మొత్తం 21 వారాలపాటు సామూహిక లింగాష్టక పారాయణం కొనసాగుతుందని భక్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పునరావాసం ఎప్పుడో..?


దేవుడ్‌పల్లి గ్రామం

- ఏళ్లు గడుస్తున్నా కనిపించని పురోగతి
- నూతన కేంద్రంలో కానరాని సౌకర్యాలు
- ఇబ్బందులు పడుతున్న దేవుడ్‌పల్లివాసులు
- పట్టించుకోని అధికారులు

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ గ్రామ పంచాయతీలోని దేవుడ్‌పల్లి గ్రామం కుమురం భీం ప్రాజెక్టులో ముంపునకు గురైంది. ఆ గ్రామంలో మొత్తం 70 కుటుంబాలు ఉండగా.. 210 జనాభా ఉంది. ప్రస్తుతం ఉన్న గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో నిసాని గ్రామానికి వెళ్లే దారిలో సమీపంలో 2011లో పునరావాసం కోసం స్థలాన్ని ఎంచుకుని 110 ప్లాట్లను ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో మురికినాలీలు సైతం నిర్మించారు. మంచి నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. కానీ ఇంతవరకు ప్లాట్లను కేటాయించలేదు. ఇతర నిర్మాణాలకు నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


పునరావాస కేంద్రంలో నిర్మించిన డ్రెయినేజీలు

కానరాని సౌకర్యాలు..

దేవుడ్‌పల్లి నుంచి ప్లాట్ల స్థలం వరకు సీసీరోడ్డు సైతం నిర్మించారు. కానీ విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం, పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు ఇంకా ఇతర నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ప్రజలు పునరావాస కేంద్రానికి వెళ్దామన్నా వెళ్లలేని పరిస్థితి ఉంది. నాలుగేళ్ల క్రితం వరకు జిల్లా కలెక్టర్ పునరావాస కేంద్రాన్ని పరిశీలించి వారం రోజుల్లో అక్కడికి తరలిస్తామన్నారు. కానీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో వారు నివసించడం గండంగా మారింది. కేబీ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రస్తుతం ఉన్న గ్రామానికి సమీపంలోకి రావడంతో పాములు, తేళ్లు తరుచూ వస్తున్నాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. పునరావాసంలో ముంపునకు గురవుతుండడంతో గ్రామంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. గ్రౌండ్ వాటర్ అధికం కావడంతో ప్రస్తుతం తాగునీరు కూడా బాగుండడం లేదని ప్రజలు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి



ప్రస్తుతం ఉంటున్న దేవుడ్‌పల్లిలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. మురికి నాలీలు లేవు. ముంపునకు గురైన గ్రామంగా భావించి ప్రస్తుతం ఇక్కడ నిధులు నిలిపివేశారు. దీంతో సౌకర్యాలు కల్పించడం లేదు. అధికారులు స్పందించాలి.

– సెంద్రి కమీనాబాయి, గృహిణి

సౌకర్యాలు కల్పించాలి



పునరావాస కేంద్రంలో విద్యుత్, అంతర్గత రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలి. పాఠశాల, అంగన్‌వాడీ భవనం నిర్మించాలి. కానీ ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టడం లేదు. ఇంతవరకు మాకు ప్లాట్లను కూడా చూపించలేదు.

– జాడి బుర్రు, రైతు

పొంచి ఉన్న ప్రమాదం



వాంకిడి మండలంలోని ఇందాని ప్రధాన రహదారిపై ఘట్‌జనగాం గ్రామ సమీపంలో భారీ గుంత ఏర్పడి ప్రమాదం పొంచి ఉంది. ఇందాని రహదారి గుండా మహారాష్ట్రకు సైతం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ రహదారిపై అనేక చోట్ల గుంతలు ఉన్నప్పటికీ ఘట్‌జనగాం వద్ద రోడ్డుపై భారీ రంధ్రం ఏర్పడింది. వాహనదారులు గుంతను గుర్తించేలా గ్రామస్తులు కర్రకు సంచిని చుట్టి గుంతలో ఏర్పాటు చేశారు. సోమవారం సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ ప్రమాదకరంగా ఉన్న గుంతను పరిశీలించి వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. – వాంకిడి

కోతులతో పరేషాన్..!

- ఇళ్లలోకి చొరబడి సామగ్రి ధ్వంసం
- దుకాణాల్లో తినుబండారాలు ఎత్తుకెళ్తున్న వానరాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


దహెగాం మార్కెట్‌లో కోతుల సంచారం

దహెగాం: మండల కేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కోతులు గుంపులుగా గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కోతులు ఏకంగా ఇళ్లలోకి చొరబడి సామగ్రి ధ్వంసం చేస్తున్నాయి. ఏమైనా వస్తువులు ఇంటి బయట పెడితే చిందరవందరగా పడేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

మనుషులపై దాడి..

గత కొన్ని నెలలుగా కోతుల బెడద లేదని గత వారం రోజుల నుంచి బెడద పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. కోతులు వచ్చిన సమయంలో వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేస్తే మనుషులపై దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాల్లోకి చొరబడి తినుబండారాలు ఎత్తుకెళ్తున్నాయని దుకాణాదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన


చింతలమానెపల్లి: దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులను సోమవారం పరిశీలించారు. చేడ్వాయి, గొంట్లపేట్, పోతెపల్లి గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఈబీసీ దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఈఈ ప్రభాకర్, ఎంపీడీవో అల్బర్ట్, టీజీబీ మేనేజర్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, యువకులు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశ పెట్టింది. ఈ పథకానికి మండలంలో 1518 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులను ఎంపిక చేయడానికి గత నాలుగు రోజులుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఎంపీడీవో అల్బర్ట్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్, సహకార బ్యాంకు మేనేజర్ రిషి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 158 మంది దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ రైతువేదికలో సోమవారం రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవోలు దరఖాస్తుదారుల నుంచి వివరాలు తీసుకున్నారు. దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. డబ్బా, అడెపల్లి గ్రామాల నుంచి వచ్చిన 72 దరఖాస్తులను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం బూరెపల్లి, ఖర్జెల్లి, బాబాపూర్ గ్రామాల దరఖాస్తుల పరిశీలన ఉంటుందని దరఖాస్తుదారులు గమనించాలని సూచించారు. ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్‌లో..


దహెగాం: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

చివరి మజిలీకి కష్టాలు!

- ఏళ్లుగా అసంపూర్తిగా శ్మశాన వాటిక
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


అసంపూర్తిగా దర్శనమిస్తున్న వైకుంఠధామం

తిర్యాణి: చివరి మజిలీకి చిక్కులు ఏర్పడొద్దని గత ఐదేళ్ల క్రితం అన్ని గ్రామపంచాయతీల్లో శ్మశాన వాటికల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఒక్కో శ్మశాన వాటిక నిర్మాణం కోసం రూ.12 లక్షల నిధులు సైతం మంజూరు చేసింది. ఈ శ్మశాన వాటిక వద్ద బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులతో పాటు మంచినీటి సౌకర్యం, మృతదేహాలను దహన సంస్కారాలు చేసేందుకు అనువుగా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. దీంతో గ్రామాల్లో కొంత వరకు కష్టాలు తప్పాయి. అయితే మండలంలోని దాదాపు అన్ని పంచాయతీలల్లో వైకుంఠ ధామాలు పూర్తయ్యి వినియోగిస్తుండగా మండల కేంద్రంలోని శ్మశాన వాటిక మాత్రం నేటికీ అసంపూర్తిగా దర్శమిస్తోంది.

పూర్తికాని పనులు..

రూ.12 లక్షలతో వైకుంఠధామం నిర్మాణం కోసం కాంట్రాక్టు తీసుకున్న గుత్తేదారు గ్రామపంచాయతీకి సంబంధించిన నిధులు అడ్వాన్సుగా తీసుకుని పనులు ప్రారంభించాడు. 70 శాతానికిపైగా పనులు సైతం పూర్తి చేశాడు. అందుకు సంబంధించి అప్పటి ఇంజనీర్ అధికారులు ఎంబీ రికార్డు చేసి రూ 3.30 లక్షల నిధులను సైతం కాంట్రాక్టర్ ఖాతాలో వేశారు. పనులు పూర్తయిన తరువాత మిగితా పనులకు సంబంధించి ఎంబీ రికార్డు నమోదు చేసి నగదును గుత్తేదారు ఖాతాల్లో జమ చేస్తారు. కానీ సదరు కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడంపై ఆసక్తి చూపకపోవడంతో వైకుంఠ ధామం అలంకారప్రాయంగా దర్శమిస్తోంది. పూర్తిస్థాయిలో నిధులు విడుదలైతే కాంట్రాక్టర్ అడ్వాన్స్ రూపంలో తీసుకున్న గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షల కూడా జమయ్యే అవకాశం ఉంటుంది. తద్వారా ఆ నగదు గ్రామాభివృద్ధికి వినియోగించవచ్చు. శ్మశాన వాటిక లేకపోవడంతో మండల కేంద్రంలోని ప్రజలు వాగులు, వంకల సమీపంలో మృతదేహాల దహన సంస్కారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని క్షేత్రస్థాయిలో వైకుంఠధామం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం..

మండల కేంద్రంలోని శ్మశాన వాటిక పనులను త్వరలో పూర్తి చేయిస్తాం. సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడుతాం. సమస్య పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తాం.

– వేముల మల్లేశం, ఎంపీడీవో, తిర్యాణి

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వాంకిడి: వేసవిలో ఎండల నుంచి రక్షణ పొందేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని హెచ్‌ఈవో రవిదాస్ సూచించారు. సోమవారం మండలంలోని ఖేడిగాం, కొలాంగూడ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లకపోవడం మంచిదన్నారు. అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి వస్తే టోపి, గొడుగు, కాళ్లకు చెప్పులు, చెవులకు రుమాలు చుట్టుకోవాలని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రత్నమాల, సునీత తదితరులు పాల్గొన్నారు.

నూతన కోర్టు భవనం మంజూరు చేయాలి


మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నూతన కోర్టు భవన నిర్మాణాన్ని మంజూరు చేయాలని సోమవారం జిల్లా కేంద్రంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఎన్‌హెచ్ –363 ప్రారంభానికి వచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి, రాష్ట్ర మంత్రి సీతక్కకు న్యాయవాదులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని న్యాయవాదులు శాలువాతో ఘనంగా సత్కరించారు. న్యాయవాదులు మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా అత్యంత వెనుకబడిన జిల్లా కాబట్టి నూతన కోర్టు భవనాలు, ఎస్సీ, ఎస్టీ కోర్టు కన్జ్యూమర్ కోర్టు ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలని పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకి వినతిపత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. న్యాయవాదులు బోనగిరి సతీశ్‌బాబు, రవీందర్‌రెడ్డి, జగన్‌మోహన్, గణేశ్, బీజేపీ నాయకులు ఖాండ్రె విశాల్, సుచిత్, సంజీవ్, రాంబాబు, సోమ, శ్రీను, వాట్సన్ పాల్గొన్నారు.

భూ భారతి రెవెన్యూ సదస్సులు


చేడ్వాయి రైతువేదికలో రెవెన్యూ సదస్సు

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి, చేడ్వాయి, అగర్‌గూడ గ్రామాల్లో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా పెంచికల్‌పేట్ మండలాన్ని ఎంపిక చేసిందన్నారు. సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల దరఖాస్తులను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్, కవిత, ఎంపీడీవో అల్బర్ట్, ఆర్‌ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు


కౌటాల: పోలీసులు పట్టుకున్న నిందితులు

వాంకిడి: పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వాంకిడి మండలంలోని బోర్దా గ్రామ శివారులో పేకాట స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో సోమవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద పట్టుబడిన రూ.17,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎక్కడైన పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కౌటాలలో..

కౌటాల: కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామంలో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మిడిహెట్టి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేశామని తెలిపారు. పేకాట ఆడుతున్న హరికృష్ణ, రాజేశ్, దేవేందర్, రాము, విలాస్, వినోద్‌లను పట్టుకొని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 2790 నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని అడెపల్లి గ్రామం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలంలోని కన్నెపెల్లికి చెందిన గుర్లె శంకర్ అనే వ్యక్తి కాగజ్‌నగర్ మండలం గన్నారంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యాడు. ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తు న్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డాడు. రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదలో పడిపోగా తలకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు 108కు సమాచారం అందించగా కాగజ్‌నగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఛత్రపతి భవనం వద్ద జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ లేక గుండిరోడ్డు వరకు తిరిగి వెళ్తుండడంతో దూరం భారంతో పాటు తరచుగా ప్రమాదాలు జరుగుతుందన్నాయని, ఛత్రపతి భవనం ముందు రహదారిపై మంచిర్యాలకు వెళ్లేందుకు ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీశ్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.